SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

ప్రజాశక్తి

Vol. 1, no. 1

(Jun. 17, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 1

(Jun. 17, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25 A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

ప్రజాశక్తి : భారత కమ్యూనిస్టుపార్టీ ఆంధ్రకమిటీ పత్రిక -- Vol. 1, no. 1 [June 17, 1942] - Vol. 2, no. 115 [April 30, 1947]

బెజవాడ : Katragadda Rajagopalarao, 1942-1947.

310 v. ; 36 cm.

Weekly

In Telugu.

Published as Weekly from 1942-1946, and daily thereafter.

Vol. numbering irregular: Vol. 1 and Vol. 2 repeated after Vol. 7.

Library lacks: Vol.5, no. 18-21, Vol. 1, no. 374, Vol. 2, no. 18, 22-23, 65, 71, 78, 96, 105.

Record no. 683

Prajāśakti : Bhārata Kamyūnisṭupārṭī Āṃdhrakamiṭī Patrika -- Vol. 1, no. 1 [June 17, 1942] - Vol. 2, no. 115 [April 30, 1947]

Bejavāḍa : Katragadda Rajagopalarao, 1942-1947.

310 v. ; 36 cm.

Weekly

In Telugu.

Published as Weekly from 1942-1946, and daily thereafter.

Vol. numbering irregular: Vol. 1 and Vol. 2 repeated after Vol. 7.

Library lacks: Vol.5, no. 18-21, Vol. 1, no. 374, Vol. 2, no. 18, 22-23, 65, 71, 78, 96, 105.

Record no. 683

35mm microfilm

Image placement: IA (IIA) IB IIB   Date filming began: 3 February, 2006

ఆంగ్లో - సోవియట్ ఒడంబడికలోని అంతరార్థం

మే 26వ తేదీన జరిగిన ఆంగ్లో-సోవియట్ ఒడంబడిక చరిత్రలో ఒక మహత్తర ఘటన. గత సంవత్సరం యుద్ధంలో సోవియటు యూనియను ప్రవేశంతో జూలై 12వ తేదీన జరిగిన ఆంగ్లో-సోవియట్ ఒడంబడికతో యుద్ధంలో అప్పుడు గొప్ప మార్పు వచ్చింది. సామ్రాజ్యవాద యుద్ధం ప్రజా యుద్ధంగా మారింది. ఆనాడు బ్రిటిషు ప్రజలు - ప్రపంచ ప్రజలు గొప్ప విజయాన్ని సంపాదించారు.

ఇపుడు జూన్ 11వ తేదీన ప్రపంచానికి బహిర్గతమైన ఆంగ్లో-సోవియటు ఒడంబడికతో ప్రజలు మరొక సాటిలేని విజయాన్ని సంపాదించారు. సామ్రాజ్యవాదులు మరోసారి ప్రజల చేతులలో తీరని అపజయాన్ని పొందారు. ఇది ప్రజా విజయం. యూరప్‌లో సామ్రాజ్యవాదుల ఆధిక్యత పోయి ప్రజలకే ఆధిక్యత వచ్చింది.

'న్యూయార్కు-టైమ్సు' వంటి పత్రికలే అంగీకరించుతున్నట్లు, "యూరప్ భవిష్యత్తులో గొప్ప ఫలితాలను కల్గించే శక్తులలో ప్రధానమైన మార్పు"ను ఈ ఒడంబడిక గావించుతుంది. లాయడ్ జార్జి వంటి సామ్రాజ్యవాదులు సైతం "ఇలాంటి ఒడంబడిక ఇదివరకే జరిగివుంటే, మన విదేశ రాజనీతిలోని అనేక పొరపాట్లు జరిగియుండేవి కావు. ఇంతేకాదు; ఈయుద్ధమే సంభవించేది కాదు" అని అంగీకరింప వలసివచ్చింది.

ఇన్నాళ్ళనుండి బ్రిటిషు ప్రజలు, యావత్ ప్రపంచ ప్రజలు కోరుతున్నదేమిటి? సోవియటు యూనియన్‌తో (1) సంపూర్ణమైన మిలటరీ సహకారం వుండే ఒడంబడిక, (2) రాజకీయంగా పరస్పర సహకారంతో కూడివుండే ఒడంబడిక. ఈ రెండు ఆశయాలు మొన్నటి ఒడంబడికలో యెలా సిద్ధించబడ్డాయి? గత సంవత్సరపు టొడంబడికను రెండు ముక్కలలో చెప్పాలంటే పరస్పర సహాయమూ - విడిగా హిట్లరు జర్మనీతో సంధి చేసికొనకుండుట. గత ఒడంబడిక ఫలితంగా సోవియటు యూనియన్‌కు, టాంకులు, విమానాలు మొదలైన యుద్ధ పరికరాలు సప్లయి జరిగినా, జర్మన్ ధాటి నంతటనూ సోవియట్ ఒక్కటే భరింపవలసి వచ్చింది. స్టాలిన్, మాలటోవ్, లిట్వినోవ్ మొదలగు సోవియట్ నాయకులు యూరప్‌లో రెండవ రంగాన్ని హిట్లరుకు కల్పించవలసిన అవశ్యకతను నొక్కిచెప్పవలసి వచ్చినది. ఈనాటి ఒడంబడికతో హిట్లరుకు యూరప్‌లో ఈ సంవత్సరంలోనే రెండవ రంగం కల్పింప నిశ్చయింప బడింది. అట్టి రంగాన్ని కల్పించడానికి బ్రిటనే గాక అమెరికా గూడ ఒప్పుకొంది. దీనితో నాజీ హిట్లరు పతనం ఈ సంవత్సరమే ఖాయమని దృఢంగా చెప్పవచ్చు. 1942 లోనే హిట్లరును ఓడించుతామన్న సోవియట్ ప్రతిజ్ఞ నెరవేరి తీరుతుంది. ఇన్నాళ్ళనుండి ప్రజలు ఆందోళన చేయుచున్న సోవియటుతో మిలిటరీ సహకారం లభ్యమయింది.

గత ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన వర్సైల్సు సంధితో శైశవావస్థలో నున్నా సోవియటు రష్యాను మొగ్గలో త్రుంచడానికి ప్రయత్నం జరిగింది. గత 20 ఏండ్లలోను సోవియటును అణచివేయడానికే ప్రపంచ సామ్రాజ్యవాదులందరు ప్రయత్నించుతూ వచ్చారు. అందుకోసమే హిట్లరు జర్మనీ బలపరచబడింది. సోవియటును నాశనం చేయాలనే పాలసీని ప్రజలు నిరోధించుతూ వచ్చారు. సోవియటుతో అన్నివిధాలా రాజకీయ ఒడంబడిక గావించుకొని స్నేహంగా వుండి శాంతికోసం ప్రయత్నించాలని ప్రజ లభిలషించుతూ వుండేవారు. అట్టి ఒడంబడికకు పునాది గత సంవత్సరం వేయబడింది. ఈ ఒడంబడికతో అది సంపూర్ణంగా లభ్యమయింది. ఇంతేగాదు, యుద్ధానంతరం దురాక్రమణలు తిరిగి జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టాలు ఈ ఒడంబడికలో గావించబడ్డాయి. ఆంగ్లో సోవియటు ఒడంబడికలోని 3వ క్లాజులో ఈ విషయం స్పష్టపరచబడింది. ఇపుడు జర్మనీ గావించినట్లు దురాక్రమణ-శాంతిని భగ్నపరచడం-యుద్ధానంతర కాలంలో అసంభవమయేటట్లు తమ యావచ్ఛక్తినీ ఉపయోగించుతామని పై నిబంధనలో స్పష్టపరచబడింది. శాంతిని కాపాడటానికి, దురాక్రమణను ప్రతిఘటించడానికి రెండు దేశాలూ ప్రతిజ్ఞ పూనాయి.

ఈ నిబంధనలోని అంతరార్థం ఏమిటి? ఇదివర కెప్పుడూ తన ప్రపంచాధిపత్యాన్ని నిలబెట్టుకోడానికి యూరప్‌లో రెండు చీలికలు తెచ్చి, తన ఆధిక్యతను స్థాపించుకొంటూ వచ్చింది బ్రిటన్ అది నేడు వదలివేయవలసివచ్చింది. అంతేగాదు, యూరప్‌లో కొన్ని కొన్ని రాజ్యాల కూటములను ఏర్పరచి, తక్కిన బలోపేతమైన రాజ్యాలను నాశనం చేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రయత్నించేవారు. ఉదాహరణకు గత యుద్ధంలో ఓడిన జర్మనీ మళ్ళీ తలయెత్తకుండా ఉండాలనే వుద్దేశ్యంతో ఆస్ట్రియాను జర్మనీనుండి విడదీశారు. జకోస్లోవేకియా మొదలగు చిన్న దేశాలను సృష్టించారు. సోవియట్‌కు వ్యతిరేకంగా బాల్కన్ బాల్టిక్ రాజ్యాలను తమ పలుకుబడిలో వుంచారు.

సోవియట్ వ్యతిరేకంగా విప్లవ ప్రతీఘాత శక్తులను బలపరచే నిమిత్తం, జర్మనీ ఫాసిజానికి చిన్న చిన్న దేశాలను బలియిచ్చారు. నాల్గు రాజ్యాల కూటమి నేర్పరచి సోవియట్‌పై దండెత్తే విఫల ప్రయత్నం చేశారు. తత్ఫలితంగా చిన్న రాజ్యాలకు రక్షణ అంటూ లేక పోయింది.

కాని, ఇప్పటి ఒడంబడికలోని 7వ నిబంధన ఫలితంగా, ఒడంబడిక గావించుకొన్న ఈ రెండు దేశాలు, ఇందులో ఏదేశానికి విరుద్ధంగానైనా ఏర్పడే రాజ్యాలకూటమిలో చేరరాదు. అలాంటి కూటమిని ఏర్పరచగూడదు. జూదంలో పాచికలలాగా ఉపయోగింపబడేభయం, చిన్న చిన్న జాతులకు, ఈ నిబంధన ద్వారా తొలగిపోయింది. సోవియట్‌కు వ్యతిరేక రాజ్యాల కూటమి అసంభవమయిపోయింది.

నాజీజర్మనీ ఓటమిఫలితంగా, నాజీ పాదాక్రాంత దేశాలలో విప్లవాలు చెలరేగుతాయి. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద ప్రభుత్వాలు తమను నాజీ దురాక్రమణ నుండి రక్షించ లేక పోయినవన్న సంగతి యూరప్ ప్రజలకు తెలుసు. నాజీలకు అపజయాన్ని కొని తెచ్చింది సోవియట్ అనికూడా తెలుసు. ఈనాడు తమ విముక్తికోసం ఫాసిస్టు భయానక నిర్బంధ విధానాన్ని అత్యద్భుతసాహసంతో ఎదుర్కొంటున్న యూరోపియన్ ప్రజలు, నాజీల అపజయానంతరం, తమ భవిష్యత్తును తామే నిర్ణయించు కొంటారు. తమ విప్లవాలు రక్షింపబడేందుకు ఆంగ్లో సోవియట్ ఒడంబడిక పూర్తిగా తోడ్పడుతుంది. గత యుద్ధానంతరం యూరప్‌లో ప్రజ్వరిల్లిన విప్లవాలను సామ్రాజ్యవాదులుఅణచివేశారు. ఈ సారి అలా అణచివేసే శక్తి సామ్రాజ్యవాదానికి పోతున్నది. ఓడిపోయిన జర్మన్, ఇటలీ మొదలగు సామ్రాజ్యవాదంతో, ప్రపంచ సామ్రాజ్యవాద పునాదియే ఎగిరిపోతున్నది. ఇప్పుడు ఇంకా సామ్రాజ్యవాద దేశాలుగా నున్న దేశాలలో యుద్ధాన్ని ప్రజలే జయించుకొపోవటంవల్ల, యూరప్ విప్లవాలలో జోక్యం కలుగజేసికొనే శక్తి వాటి కుండదు. ఒకవేళ అలా కలుగజేసికొన ప్రయత్నించితే, ఈ ఒడంబడికలోని 5వ నిబంధన అడ్డు వస్తుంది. 'ఇతరరాజ్యాలలోని అంతర్గత సంబంధాలలో జోక్యం కలుగజేసికొనరాదు' అని దీనిలో వుంది. దీనిని అతిక్రమించి సామ్రాజ్యవాదులు విప్లవాలను అణచడానికి ఒకవేళ ప్రయత్నించితే సోవియటు సహించదు. దీని అర్థం. ఇతరులు దీనిని అతిక్రమించినా, సోవియటు అతిక్రమించదని అర్థంకాదు. స్పెయిన్‌లో తటస్థతను ఫేసిస్టులు ఉల్లంఘించినపుడు, సోవియటు కూడా ఉల్లంఘించింది. ఇతర దేశాలలో కలుగజేసికోదంటే అర్థం, ఆ దేశాలకు విప్లవాలను దిగుమతి చేయదనేకాని, ఆదేశాల ప్రజలు విప్లవంకోసం పాటుబడవద్దని కాదు. అలా పాటుబడే దేశాలకు సోవియట్ సహాయం ఎల్లప్పుడూ వుంటుంది. (మిగతా ప్రక్కపేజీలో)

మన రాజకీయాలు

మహత్తరమైన ఈ ప్రపంచ ప్రజా యుద్ధంలో భారత స్వాతంత్ర్య సంపాదనకు, భారత ప్రజల కర్తవ్యాన్ని గురించి ఆలోచించేటప్పుడు గాంధీజీ, కాంగ్రెసునాయకుల, దృక్పథాలు పరిశీలించవలసి వుంటుంది.

గాంధీజీ మొన్న మొన్నటిదాకా మన దేశంలో జాతీయైక్యత కుదిరితే గాని స్వాతంత్ర్యం రాదని చెప్పే తన అభిప్రాయాన్ని అకస్మాత్తుగా మార్చి వేసుకున్నాడు. ఇప్పుడు స్వరాజ్యంవస్తే జాతీయైక్యత దానంతటదే వచ్చేస్తుందని అంటున్నాడు. ఇది ఆయన వృథ నమ్మకమట. రెండోది బ్రిటిష్ అమెరికను సైన్యాలు ఈ దేశంనుంచి వెళ్ళిపోతే మన స్వాతంత్ర్యం సంగతి మనమే చూసుకుంటాం అంటాడు.

అయితే యిప్పటి పరిస్థితులలో మనకు స్వాతంత్ర్యం ఎలా వస్తుంది? ముఖ్యంగా యీనాడు మన స్వాతంత్ర్యం జపాన్ ఫాసిజమును నాశనం జేయడం ద్వారానే వస్తుంది. ఈ కార్యం భారత ప్రజల సంఘటిత శక్తి ద్వారా మాత్రమే సాధించ బడుతుంది. సామ్రాజ్యవాద పాలకులకై యెదురు చూడడముద్వారా యెన్నడూ రాదు. ఇందుకు ప్రజల శక్తులన్నిటిని సమాయత్తపర్చి, ప్రజలలో పూర్తి యైక్యతను ఏర్పరచ వలసివుంది. ఈరోజు ప్రజాఐక్యత ప్రజల నందరిని యెదుర్కొనుచున్న జపాను ఫాసిస్టు ప్రమాదాన్ని ఓడించే క్రమములోనే సాధ్యమౌతుంది. ఈ కార్యక్రమాన్ని నెరవేర్చుటకు ప్రజా శక్తిపైనను, ప్రజా ఐక్యత పైన ఆధారపడక యిందుకు తీవ్ర కృషిచేయక సామ్రాజ్యవాదులపై పే గాంధి యెదురు చూస్తున్నాడు. అందుచేతనే ప్రజా యైక్యత ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించడానికి నిరాకరిస్తున్నాడు, ఇది బూర్జువా పోరాట పద్ధతి. సామ్రాజ్యవాద దశలో ప్రజా పోరాటమును గొనిరావడానికి నిరాకరించి స్వాతంత్ర్య సంపాదన మహదవకాశమును జారవిడిచినట్లే యీనాడు ప్రజా యైక్యతకొరకు కృషి సలుపుటకు నిరాకరించుట ద్వారాను సామ్రాజ్యవాదుల వైపు నోరు తెరుచుకొని కూర్చొనడం ద్వారాను స్వాతంత్ర్యమును సంపాదించే యిప్పటి మహదవకాశాన్ని జారవిడుస్తున్నాము. కాని ప్రజలు యీ అవకాశాన్ని జారవిడువరు. ప్రజా యుద్ధంలో పాల్గొని తప్పక తమ స్వేచ్ఛను పొందుతారు.

రెండవ విషయము గూర్చి చూద్దాం. ఈరోజున మన స్వాతంత్ర్య పోరాటము జపాను వ్యతిరేక పోరాటమే అయినప్పుడు జపాను దాడిని అరికట్టి, బ్రిటిషు, అమెరికన్ సైన్యాల కృషి మన స్వాతంత్ర్య సంపాదన గూడ తప్పక తోడ్పడుతుంది. అట్టి సైన్యాలను భారత దేశాన్ని విడిచిపెట్టి పొమ్మనడం జపానుకు భారత దేశాన్ని ఆక్రమించుకోవడానికి రహదారీ శుభ్రపర్చడమే అవుతూవుంది.

ఈ మార్గము జపానుకు పూర్తిగా లొంగిపోవడానికో లేక దానితో రాజీకి వెతుకులాడుటకో దారి తీస్తుంది. విదేశ సైన్యాలన్నీ భారత దేశాన్ని వీడిపోవాలనే గాంధిగారి నినాద పర్యవసానము యిదే.

అసఫ్ ఆలీ ప్రకటన.

ఇక కాంగ్రెసు నాయకులలో కొందరి ధోరణిచూద్దాం. నేడు ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే ప్రపంచ ప్రజా యుద్ధ భవిష్యత్తులోనే భారతదేశ భవిష్యత్తు వుందని, భారతదేశము ఆయుద్ధంలో పాల్గొని తన కర్తవ్యాన్ని నెరవేర్చ వలసిన అవశ్యకతను ప్రజలకు తెలియ జేయడానికి బదులు, ప్రపంచ ప్రజలకు నాయకత్వం వహించుతున్న సోవియట్ యూనియన్‌పై ప్రజలలో అపోహలు కల్గించడానికి కూడ కొందరు పూనుకుంటున్నారు. ఈనెల 12వ తేదీని, కాంగ్రెసు వర్కింగుకమిటీ సభ్యుడు, సెంట్రల్ ఎస్సెంబ్లీ కాంగ్రెసుపార్టీ జనరల్ సెక్రటరీ అయిన అసఫ్‌ఆలీ ప్రకటన అటువంటిదే. మే నెల 26వ తేదీన సోవియట్ యూనియన్ బ్రిటనుతో చేసుకొన్న సంధి (జూన్ 11వ తేదీని పత్రికలలో బైటపడింది) సోవియట్ యూనియన్ అట్లాంటిక్ చార్టరును అంగీకరించిందికనుకనూ, ఇతరదేశాల ఆంతరంగిక వ్యవహారాలలో కలుగజేసుకోనని అన్నది కనుకనూ, సోవియట్ యూనియన్ తన విప్లవపాత్రను త్యజించి వేసిందనీ, సామ్రాజ్యవాదులకు లొంగిపోయిందనీ దీనిని బట్టి హిందూదేశంలో, ఇది ప్రజాయుద్ధమని చెప్పే కమ్యూనిస్టుల వాదనలన్నీ తలక్రిందులవుతాయనీ, ఆసఫాలీ ప్రకటించాడు.

అట్లాంటిక్ చార్టరులో హిందూదేశ సంగతి వుంటుందని బ్రిటిషు ప్రభుత్వం అనడంలేదు. గనక ఆ చార్టరును సోవియట్ అంగీకరించడం తన విప్లవ పాత్రను త్యజించడమే నని ఆసఫాలీ అంటున్నాడు. యూరోపా దేశాలకే గాక ప్రపంచములోని అన్ని జాతులకు స్వయం నిర్ణయాధికార ముండాలనే సూత్రాన్ని సోవియట్ యెప్పుడూ ప్రచారం చేస్తూనే వుంది. గత సంవత్సరం అక్టోబరులో లండనులో జరిగిన మిత్రమండలి దేశాల సభలో అప్పటి రష్యన్ రాయబారి అయిన మెయిస్కీ అట్లాంటిక్ చార్టరు యూరప్‌కే గాక ప్రపంచమందన్నిజాతులకు గూడ వర్తించాలనీ అప్పుడే స్థిరమైన శాంతి వుంటుందని స్పష్టపర్చాడు. ఈ విషయమే స్టాలిన్, మోలటావ్‌లు గూడ (రష్యా ప్రపంచ ప్రజలందరి విముక్తికై పోరాడుచున్నదనే విషయాన్ని) పదేపదే వెలిబుచ్చుచున్నారు. అందుచే సోవియట్ యూనియన్ అట్లాంటిక్ చార్టరును అంగీకరించిందంటే, దాన్ని భారతదేశములాంటి వలసరాజ్యాలకు అనువర్తింపజేయరాదనే చర్చిల్, అమెరీల వాదనలతో ఏకీభవించు చున్నదని కాదు. బూర్జువా విమర్శన సోవియట్‌పై అపోహలను కలుగజేయుటకే వుద్దేశింప బడింది.

ఇతరదేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలిగించుకోనని సోవియట్‌యూనియన్ ఒప్పుకోడం, దాని విప్లవపాలసీకి తిలోదకాలు వదలడమే నని అసఫాలీ అర్థం చెబుతున్నాడు.

ఇది సోవియట్ పాలసీని అర్థం చేసుకోలేపోవడమే కాకుండా, ఏ స్టాలినో ఏ రూజ్‌వెల్టో మనకు స్వాతంత్ర్యం ఇప్పించాలని అనుకునే వారి దృక్పథం తప్ప మరోటికాదు. తనతో మిత్రులుగా వున్న ప్రభుత్వాల మెడలువిరిచి అక్కడ ప్రజాప్రభుత్వాలు బలవంతంగా స్థాపించడం, బానిసదేశాలకు స్వాతంత్ర్యం, తానే కృషిచేసి తెచ్చిపెట్టడం సోవియట్ విప్లవ పాలసీకాదు. అలా అని ఆయా దేశాలలో వచ్చే ప్రజావిప్లవాలకు సహాయం చేయకుండా వూరుకోదు. తప్పక చేస్తుంది. ఉదాహరణకు, స్పెయిన్, చైనా దేశాలలో ప్రజా పోరాటాలపట్ల సోవియట్ వైఖరి చూడండి.

అసఫాలీ ప్రకటన మన జాతీయ బూర్జువా నాయకుల ధోరణిని చక్కగా ప్రదర్శించుతుంది. తాము ఈ ప్రపంచ ప్రజా యుద్ధంలో భారత ప్రజల పాత్రను గుర్తించక, ప్రజలకు కార్యక్రమం ఇవ్వక ప్రజలలో నానాటికి ఎక్కువ అవుతున్న సోవియట్ అనుకూల వైఖరిని చూచి భయపడి, సోవియట్‌పై అపోహలు కల్గించుచున్నారు. దీనికి ప్రజలలో సహజంగా వున్న బ్రిటిషు వ్యతిరేక భావాన్ని, దానికితోడు యిప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం అవలంబిస్తున్న తెలివితక్కువ నిర్బంధ విధానాన్ని (యు. పి. రాష్ట్రంలో రఫీ అహమ్మద్ కిద్వాయి, పంజాబులో సోవియట్ మిత్రమండలి అధ్యక్షుని అరెస్టు వగైరా) వారు చక్కగా ఉపయోగించుకుంటున్నారు.

ఆంగ్లో - సోవియట్ ఒడంబడికలోని అంతరార్థం

దీనికి నిదర్శనం స్పైన్ - చైనాలే.

ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించి, నిరుద్యోగాన్ని నిర్మూలించి జాతీయ సమస్య పరిష్కరించి యే దేశమూ ఎదుర్కొనలేక పోయిన నాజీధాటిని ప్రతిఘటించి నిలబడిన - గత 20 ఏండ్లనుండి శాంతి కోసం, జాతులకు స్వాతంత్ర్యంకోసం నిరంతర ఆందోళన గావించిన - సోవియటు యూనియన్ సగర్వంగా నిలబడి యుండటమే, ప్రపంచ విప్లవ పీడిత ప్రజల పోరాటానికి ఆశా జ్యోతిగా వుంది.

ఈఒడంబడిక ఒక్క యూరప్‌కే గాక, తక్కిన దేశాలకు కూడ అన్వయింప జేసుకొనే అవకాశం మూడవ నిబంధన (1) లో వుంది. యుద్ధానంతర కాలంలో దురాక్రమణను నిరోధించడానికీ, శాంతిని రక్షించడానికిగాను ఒకే కార్యాచరణా సూచనలను అవలంబించుటలో, ఇలాంటి దృక్పథంగల ఇతర దేశాలతో కలియడానికి వాంఛించుచున్నాము." అని ఈ నిబంధన ఉపక్రమణికలో ఇదే వివరింపబడింది.

ఇంతేగాక మిత్రమండలిదేశాలు అని దీనిలో పేర్కొన బడింది. మన దేశం బ్రిటిషు సామ్రాజ్యవాద బానిస దేశంగా మిత్రమండలిలో వుందికదా, అది మనకెలాంటి లాభంగలిస్తుందని ప్రశ్నించవచ్చు. ప్రజా యుద్ధంలో పాల్గొనుట ద్వారా, జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకొనుటద్వారా, సామ్రాజ్యవాద పెత్తనం కృశించుతుంది. శాంతి సభలో, జాతీయ ప్రభుత్వ ప్రతినిధుల కోర్కెలను బలపరచడానికి, జపాన్ ఫేసిజాన్ని అరికట్టిన హిందూదేశ ప్రజాబలం వుంటుంది. ఎపుడూ బానిస జాతులకు స్వాతంత్ర్యమివ్వమని కోరుతూ వచ్చిన సోవియట్ అండవుంటుంది. అందుచేత బానిస భారతదేశం స్వతంత్ర భారత్‌గా మారేపని మన చేతులలో వుంది.

ఆంగ్లో-సోవియట్ ఒడంబడిక, కామ్రేడ్ మాలటోవ్ చెప్పినట్లు ఒక్క సోవియట్ ప్రజలకూ బ్రిటిషు ప్రజలకు మాత్రమే ముఖ్యంకాదు. ఇతర దేశాల ప్రజలకు కూడా ఇది ముఖ్యం. ప్రవదా పత్రిక ఈ ఒడంబడిక "శాంతి సంధికి అట్లాంటిక్ చార్టర్‌లో ప్రతిపాదించిన సూత్రాలకు సంబధించిన సమస్యలన్నిటికీ వర్తించుతుంది." అని వ్రాసింది. అట్లాంటిక్ చార్టర్‌పై దస్కతు చేస్తూ, మెయిస్కీ, అన్ని జాతులకూ స్వతంత్రహక్కు ఉండాలని చెప్పిన సంగతి మరచిపోరాదు. చర్చిల్, అమెరీకాల భాష్యకరణానికి యుద్ధానంతరం తావుండదనే విషయం జ్ఞప్తిలో వుంచుకోవాలి.

జూన్ 22 వ తేదీని రష్యా విజయోత్సవాలు జరపండి!

చలసాని వాసుదేవరావు(ఆంధ్రరాష్ట్ర ఫాసిష్టువ్యతిరేక కేంద్రం) టి. కె. రామస్వామి (కృష్ణాజిల్లా ఫాసిష్టువ్యతిరేక కేంద్రం) మానికొండ సూర్యావతి (కృష్ణాజిల్లా మహిళాసంఘం) ముక్కామల నాగభూషణం (కృష్ణాజిల్లా రైతు సంఘాధ్యక్షులు) గుంటూరు బాపనయ్య (కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీ సంఘం) యల్. వి. రత్నం (ఆంధ్రరాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్) వి. వి. దాసు (కృష్ణాజిల్లా యువజన సంఘం) యం. రాధాకృష్ణ (ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘం) యల్. బి. గంగాధరరావు (గుంటూరుజిల్లా యువజనసంఘం, యం. రాధాకృష్ణరావు(కృష్ణాజిల్లావిద్యార్థి సంఘం) ఎ. యల్. నారాయణస్వామి (యం. యస్. యం. రైల్వే ఎంప్లాయిస్ యూనియను) గార్లు ఈక్రింది ప్రకటనను గావించుచున్నారు.

"1941 వ సంవత్సరం జూన్ 22 ప్రపంచ చరిత్రలో అతిప్రాముఖ్యమైన దినం, ప్రపంచంలోని పీడిత ప్రజల కాణాచియైన సోవియట్ రష్యాపై జర్మను ఫాసిష్టు దుండగీండ్రు సామ్రాజ్య పిపాసతో అగస్మాత్తుగా దాడిప్రారంభించి ఇప్పటి కప్పుడే సంవత్సరమౌతోంది. ఈ సంవత్సరం నుంచీ రష్యన్ ప్రజలు ఫాసిష్టురాక్షసులను హతమార్చుటకుగాను తమ సర్వశక్తులనూ కేంద్రీకరించి అకుంఠితమైన పట్టుదలతోను, ధైర్యంతోను ఫాసిస్టుల నెదిరించుచున్నారు. దేశంలోని వివిధ జాతులు ప్రజలు ఐక్యతతో ఫాసిస్టుల పరిమార్చుటకొరకు బద్ధకంకణులై కృషి చేయుచున్నారు. సోవియట్ రష్యాలోని ప్రజలకూ, సైన్యానికీ మధ్య అన్యోన్య స్నేహ భావాలు పెంపొంది ఒకరి కొకరు చేతులు కలుపుకొని యుద్ధరంగంలో శత్రువును ఢీ కొంటున్నారు. 1942 వ సంవత్సరంలో హిట్లరునూ, అతని ఫాసిస్టు ముఠానూ అణగ కొట్టుటకు రష్యన్ ప్రజలు స్థిర సంకల్పులై యున్నారు.

ప్రపంచమంతటా జరుగు ఫాసిష్టు వ్యతిరేక ప్రజా యుద్ధంలో భారత స్వాతంత్ర్య పోరాటం ఇమిడి యున్నది. రేపో మాపో జపాను ఫాసిస్టులు మన దేశంపై దురాక్రమణ సాగించబోతున్నారు. మన దేశంలోని వివిధ జాతులమధ్య ప్రజా సైన్యాల మధ్య ఐక్యమత్యాన్ని పెంపొందించుకొని జపాను ఫాసిస్టుల నెదుర్కోవాలి. రష్యన్ ప్రజలవలె దృఢ నిశ్చయంతో దురాక్రమణ దాడుల నెదుర్కొనుట ద్వారా ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యం కొరకు జరుగుచున్న ఈ యుద్ధంలో మనము మన బాధ్యతను నెరవేర్చినవార మవుతాం. కాబట్టి ఈ నెల 22 వ తారీఖున గ్రామ గ్రామానా, ప్రతి పట్టణంలోనూ రష్యన్ విజయోత్సవము జరపండి. రష్యన్ ప్రజలు ప్రపంచంలోని పీడిత ప్రజల కండగా నిలబడి, ఫాసిస్టుల పరిమార్చుటకొరకు సాగించుచున్న వీరోచిత చర్యలను భారత ప్రజానీకానికి తెలియచేయండి. తద్వారా భారత ప్రజలలో ఉత్సాహోద్రేకాలనూ పట్టుదలనూ రేకెత్తించుటకు కృషి చేయవలసిందిగా అన్ని ప్రజా సంస్థలనూ కోరుచున్నాము."

కృష్ణాజిల్లాలో ఫాసిస్టు వ్యతిరేక ప్రచార విధానం

కృష్ణాజిల్లా యువజన, విద్యార్థి సంఘ యాజమాన్యాన ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం గావించుటకు, యుద్ధసమయంలో ప్రజారక్షణ కవసరమైన శిక్షణ యిచ్చుటకూ గండిగుంటలో ఏప్రియల్ 10 వ తేదీనుండి 25 వ తేదీవరకు శిక్షణాశిబిరం 15 రోజులు జరిగింది. శిబిరంలో మొత్తం 57 గురు శిక్షణ పొందారు. అందులో 36 గురు యువకులు 15 కేంద్రాలలో కార్యక్రమాన్ని కొనసాగించారు. కేంద్రాలు యీ క్రింది గ్రామాల్లో యేర్పాటు చేయబడ్డాయి.

గుడివాడ తాలూకా.

(1) చేటపల్లి (2) కురుమద్దాల (3) జనార్దనపురం (4) తమిరిశ.

గన్నవరం తాలూకా.

(1) తేలప్రోలు (2) మామిడిపల్లి (3) ఉంగుటూరు. (4) తాడంకి (5) కలపాముల.

దివి తాలూకా

(1) నాచెళ్ళవారిపాలెం (2) వేములమడ (3) కొత్తపాలెం.

బందరు తాలూకా

(1) పెడన.

బెజవాడ తాలూకా

(1) పెనమలూరు (2) బెజవాడసిటీ.

ఎన్నో గ్రామాలలో తొంభై బహిరంగ సభలు జరిగాయి. బహిరంగ సభలకు మొత్తం 25 వేల ప్రజ లరుదెంచారు.

ప్రచార పద్ధతులు

బహిరంగసభలకు ప్రజలను ఆకర్షించుటకూ, ప్రజాసామాన్యానికి విషయాలు సులభంగా బోధపడుటకూ చిత్ర విచిత్ర వేషాలు, నాటకాలు, బుర్రకథలు, సంభాషణలు, సమిష్టి గానము, బిగ్గరగా వినబడుటకు గ్రామఫోను గొట్టాలూ మొదలైన పద్ధతు లవలంభింప బడ్డాయి.

చిత్రవిచిత్ర వేషాలు

డాక్టరు వేషం :—బజారులో మందు లమ్ముకోటానికి వచ్చేవాళ్ళు యీ పద్ధతిని అవలంబిస్తుంటారు. ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో ఉన్న రాజకీయ, సాంఘిక రోగాల పేర్లు చెప్పి వాటికన్నిటికీ సోషలిజం అనేది సర్వరోగనివారిణి అని చెప్తుంటారు. "సామ్రాజ్యవాద చప్పరోగాలకు, పెట్టుబడిదారీ పెనురోగాలకు ....సోషలిజం సర్వరోగ నివారిణి" అని యీమందు రష్యాలో ఉపయోగించారనీ, అక్కడి ప్రజలంతా యిప్పుడు సుఖంగా ఉంటున్నారనీ చెప్పేవారు.

గొల్లసుద్దులు

గొల్లల మాదిరిగా యిద్దరు వేషాలు వేసుకునేవారు. అందులో ఒకడు తెలివిగలవాడు. రెండవవాడు అమాయకుడు. మొదటివాడు రెండోవానితో వాళ్ళూళ్ళో విద్యార్థిసంఘం వాళ్ళూ, యువజనసంఘం వాళ్ళూ మీటింగు పెట్టారనీ, జపానువాళ్ళ నెదుర్కొనే పద్ధతులూ, దొంగచాటుగా దెబ్బకొట్టే గొరిల్లా ఎత్తులూ, విమాన దాడి రక్షణసూత్రాలూ, బాంబుల స్వరూపమూ మొదలైన విషయాలను గూర్చి, జపాను వస్తే రైతులకూ, కూలీలకూ కల్గే కష్టాలను గూర్చి చెపుతూ సుద్దుల ద్వారా ప్రజల కర్తవ్యాన్ని గూర్చి చెప్పేవారు. ఈ పద్ధతి ప్రజాసామాన్యాన్ని బాగా ఆకర్షించింది.

సింగి వేషం

సింగి వేషం వేసికొని బుట్ట చంకన పెట్టి పాటలు, పాడేవారు. "హిట్లరంత మోసగాడు వెదికినాను కానరాడు - ఎంత చిత్ర జంతువయ్య హిట్లరూ" అను పాట పాడబడుతుండేది.

మాదిగ వేషం

ప్రచారానికి వెళ్ళినపుడు మాదిగవేషం వేసికొని 'ఫలానాచోట బాంబుల్ని గురించి మీటింగు చేస్తారు కాబట్టి అంతా రావల్సిందహో' అను కేకలేస్తూ చాటింపు వేసేసరికి ప్రజలు తండోపతండాలుగా సభలకు వచ్చేవారు.

తత్త్వాలు, లేక మాస్కో యాత్ర

దళం వారందరూ సాధువుల వేషం వేసికొని "నందామయా గురుడ నందామయా" అన్న శైలిలో "తథ్యమురా మనకు తథ్యమురా, ఇంక ఆనంద జీవితమె తథ్యమురా" అను తత్వాన్ని ఊరంతా పాడుతూ తిరిగేసరికి గ్రామస్థులందరూ వింతగా వారి వెంట సభలకు వచ్చేవారు.

బుర్ర కథలు

ప్రస్తుత ప్రజా యుద్ధాన్ని గురించి బుర్ర కథలు చెప్పేవారు. యుద్ధాన్ని గూర్చి బుర్రకథ ఉందనేసరికి ప్రజలు విరివిగా వస్తుండేవారు.

నాటకాలు

జపాను వ్యతిరేకతను కల్గించే నాటకాలు కొన్నిచోట్ల ప్రదర్శించబడ్డాయి.

(1) అజేయ చైనా, (2) మాతృభూమి, (3) గోరిల్లా. నాటకాలు సభల మధ్య కొద్దికాలం ప్రదర్శింపబడుతుండేవి.

సమిష్టి గానము

సభా ప్రారంభమున, చివర కూడ "ఎన్నాళ్ళీ పిరికితనం బాబు" అనే పాట పాడుతుండేవారు, ప్రజ లందరి చేత అనిపించేవారు. అవకాశ మున్నపుడల్లా ఫాసిస్టు వ్యతిరేక గీతాలు, జాతీయ గేయాలు పాడుతుండేవారు.

బిగ్గరగా వినబడే పద్ధతులు

గ్రామంలోకి వెళ్ళగానే బిగ్గరగా వినబడటంకోసం గ్రామఫోను గొట్టాలు (Mega phone) ద్వారా పాటలు పాడుతూ ఊరంతా తిరిగి ప్రతి సెంటరులోను 'ఫలానా చోట, ఫలానా విషయంపై మీటింగు జరుగుతుందని" చెప్పేవారు.

అధ్యయన తరగతులు

రాజకీయ విజ్ఞానం కల్గించుటకూ, ప్రథమ చికిత్స, విమానదాడి రక్షణ సూత్రాలూ, రాజకీయ భూగోళమూ మొదలైన విషయాలు బోధించుటకు క్లాసులు నడుపబడ్డాయి. వాగ్వాదములు కూడ జరుపబడ్డాయి, మొత్తం 150 మందికి శిక్షణ యివ్వబడింది.

తాలూకా యువజన మహాసభ - గుంటూరు

పై మహాసభ పెదపలుపూడిలో జూన్ 10 వ తేదీని జయప్రదంగా జరిగింది. 62 మంది ప్రతినిధులు వచ్చారు. మాదల వీరభద్రరావుగారు అధ్యక్షత వహించారు.

దీనితోపాటు. యం. రాధాకృష్ణగారి అధ్యక్షతక్రింద వైజ్ఞానికమహాసభ జరిగింది. సంగీత పోటీలుకూడ జరిగాయి.

తీర్మానాలు

(1) రాజకీయ ఖైదీల విడుదల మహజర్లు, డిప్యుటేషను ఆందోళన గావించాలనీ

(2) జాతీయ ప్రభుత్వస్థాపనకు కాంగ్రెసు - లీగ్ ఐక్యత అవసరమనీ, అందుకు కాంగ్రెసు కృషిచేయాలనీ.

(3) సోవియట్, చైనాల వీర ప్రతిఘటనను అభినందించుతూ తీర్మానించబడింది.

తాలూకా యువజన సంఘం గన్నవరం

జూన్ 4 వ తేదీని గన్నవరం తాలూకా యువజన సంఘం వర్కింగు కమిటీ సమావేశం, కాటూరుగ్రామంలో శెనగల విశ్వనాథంగారి అధ్యక్షతను జరిగింది.

(1) ప్రతి గ్రామ యువజనసంఘమూ వార్తాప్రచారం, నిరక్షరాస్యత నిర్మూలనము, వార్ న్యూస్ పేపర్సు కట్టుట, జపాను వ్యతిరేకప్రచారము చెయ్యాలనీ (2) డిటిన్యూలను. రాజకీయ ఖైదీలను విడుదలచెయ్యాలని, జాతీయ ప్రభుత్వం ఏర్పరచాలని. (3) జపాను దురాక్రమణను ప్రతిఘటించాలని, (4) గెరిల్లా ట్రైనింగు సెంటర్లు ఏర్పరచవలసినదిగా ఉభయజిల్లా కాంగ్రెసుకమిటీలను కోరుతూను, (5) 40 గ్రామాలలో 40 వేల ప్రజలలో ప్రచారం చేసిన తాలూకాలోని రెండు దళాలను అభినందించుతూ తీర్మానాలు చేయబడ్డాయి.

అధిక లాభాలు అరికట్టాలి

జూన్ 9 వ తేదీన రాజమండ్రి ట్రేడ్ యూనియన్ కౌన్సిలు యాజమాన్యాన షుమారు వెయ్యిమంది. అడితీ, క్వారీ, జట్లు బండ్లు మొదలగు వృత్తుల కార్మికులు బ్రహ్మాండమైన ఊరేగింపుతో ధరల కంట్రోలింగ్ ఆఫీసరు వద్దకు డిప్యుటేషన్ వెళ్ళిరి. పండించే రైతుల నుండి ధాన్యం తక్కువ ధరకు కొంటూ తమకు బియ్యం విపరీతమైన హెచ్చు ధరకు అమ్ముచున్నారని—కిరసనాయిల్ గవర్నమెంటు నిర్ణీత రేటుకు అమ్మక, విశేషంగా ధర పెంచి అమ్ముచున్నారని ఇదేవిధంగా యితర సరుకులవిషయంలో చేస్తున్నారని చెప్పిరి. కొద్దిమంది మధ్య దళారీలు విపరీతలాభాలు గుంజుకుంటూ, అశాంతికి కారకు లవుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో యిట్లు సాగనిచ్చుట ప్రజలకు దేశానికీ, చాలా ప్రమాదం. కావున తక్షణం పేదప్రజలకు అందుబాటులో నుండు నటుల అసలుధరల కమ్మే అంగళ్ళు ప్రభుత్వమే పెట్టాలని, అట్లు పెట్టేవరకు యీ వర్తకుల అన్యాయాన్ని అరికట్టుటకై తగు చర్య తీసుకోవాలని చెప్పిరి. దానిపై తహసిల్దార్. ధరలకంట్రోలింగ్ ఆఫీసరుగారు అట్లు జరగకుండా త్వరలోనే తగు యేర్పాట్లు చేస్తామనిరి.

ప్రజారక్షణ శిక్షణాశిబిరం రాజమండ్రి

తూర్పుగోదావరిజిల్లా బ్రిగేడ్, జిల్లా విద్యార్థిసంఘ సంయుక్త యాజమాన్యాన రాజమండ్రిలో యీనెల 21 వ తేదీ ఉదయం లగాయతు 28 వరకు, విమానదాడుల రక్షణ- అగ్నిప్రమాదాల రక్షణ- గస్తీదళాల, వార్తాహరుల విధులు— ప్రథమచికిత్సాపద్ధతులు—హోమ్‌గార్డ్సు డ్రిల్లు (లాఠీలతో) —ఈత—దూరం, ఎత్తు దూకుట—నావనడుపుట—బ్రిగేడ్ నిర్మాణం—క్రమశిక్షణ — కార్యనిర్వాహణ—ప్రజాయుద్ధం గురించి— ఫాసిష్టు వ్యతిరేక ప్రచారపద్ధతులు మొదలగునవి నేర్పబడును.

తెలుగు బాగుగా వ్రాయ, చదువగల ఆరోగ్యవంతులైనవారు మాత్రమే చేర్చుకోబడుదురు.

ఆర్గనైజింగు కమిటీవారు ఏర్పరచిన చోటనే భోజనం, బసచెయ్యాలి. వాటికై రు 4 లు రుసుము చెల్లించాలి.

మామూలు అవసర సామానులకు తోడు రెండు నిక్కర్లు 4 అం॥ పొడుగువున్న చేతికర్ర, సైకిలు, వ్రాతసామానులు, ఎవరికి వారు తెచ్చుకోవాలి.

దరఖాస్తులు బ్రిగేడ్ ఆఫీసుకు పంపాలి. తీసుకోబడినట్లు తెలియజేయబడినవారు 20 వ తేదీ రాత్రికి బ్రిగేడ్ ఆఫీసుకు చేరాలి.

కె. నాగభూషణం,
కమేండర్, తూర్పుగోదావరి బ్రిగేడ్ఆఫీసు,
మెయిన్‌రోడ్, రాజమండ్రి.

రైల్వే కార్మికసమస్యలు

యం. అండ్ యస్. యం. రైల్వే పనివారల సంఘ యాజమాన్యమున 10-6-42 తేదీన సాయంత్రం 5 గం॥లకు యింజనీరింగు వర్కుషాపు వద్దనుండి వూరేగింపు బయలుదేరి సత్యనారాయణ పేటలో బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ యం. గోవిందులుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిపిరి. దాదాపు 200 మంది కార్మికులు వచ్చిరి.

ఈ క్రింది తీర్మానాలు వెంటనే చర్యతీసుకోవాలని యేజంటును కోరుచూ చేయబడెను.

(1) షేకు సాబు అనే యింజను క్లీనరు మేస్త్రీని అన్యాయంగా గుంటకల్ డి. టి. యస్. పి. ట్రాన్సుఫర్ చేసినప్పుడు అతని ట్రాన్సుఫర్‌కు అసమ్మతిని తెలియ జేస్తూ లోకో కార్మికులు 210 సంతకాలు చేసి అప్పీలు పెడితే దానిని పై అధికారి లెక్కచేయక అతనిని ట్రాన్సుఫర్ ఆర్డరు ప్రకారం దొనకొండ వెళ్ళలేదని సస్పెండు చేయటం, అతడు పై అధికార్లకు అపీలు చేసుకున్నాను. జవాబు వచ్చేవరకు ఆగమన్నా వినకపోవటం, అద్వాన్న జీతం యిమ్మని అడిగితే నిరాకరించటం మొదలగు నిరంకుశచర్యలను యీ సభవారు ఖండించుచూ అతనిపై సస్పెన్ ఆర్డరు వెంటనే రద్దుపరుస్తూ ట్రాన్సుఫర్ ఆర్డరును కాన్సిల్ చేయాలని ఈసభవారు కోరుచున్నారు.

(2) గుంటకల్ అసిస్టెంటు యింజనీరు కార్మికులను పెట్టే బాధలకు కార్మికులు ఓర్చుకొనలేక దాదాపు 150 మంది కార్మికుల తమ కష్టాలను తెలియజేస్తూ చీఫ్ యింజనీరుకు అపీలు పెట్టుకున్నప్పుడు దానిమీద డిస్ట్రిక్టు యింజనీరు యిన్షిల్ పెట్టి కార్మికులు ఒకటి చేసితే మరియొకటి వ్రాసుకొని ట్రాన్సుఫర్లు ప్రమోషన్లయందు అన్యాయాలు వ్రాసుకోకపోవడం అసిస్టెంటు యింజనీరు నేను తప్పు చేశాను క్షమిస్తారా అని కార్మికులను క్షమాపణ కోరడం, మీరు కష్టాలు తీరుస్తారన్న సంకల్పముతో అపీలు పెట్టుకున్నాం. అంతకంటే క్షమాపణలు ఒప్పుకోడం మా పనికాదు, అని జవాబు చెప్పారు. యింతటిలో యంక్వరీని జిల్లాయింజనీరు ఆపినేసి నీళ్లతుడవటానికి మిమ్మల్ని మీరు కోరినచోటకు ట్రాన్సుఫర్లు, మీ ప్రమోషన్లు యిచ్చేస్తానని చెప్పాడు. యెంక్వరీలో ఘట్టిగా నిలబడిన వెంకటస్వామి అను గ్యాంగి పనివానిని అతడు కోరినట్లుగా అనంతపూర్ ట్రాన్సుఫర్ చేస్తూ ప్యాసులిచ్చి అతడు అనంతపూరు వెళుతున్న ఒల్లూరు యిన్‌స్పెక్టరుతో అతనిని ఒల్లూరులో ఆపించి వారంరోజులవరకు అతనిని అనేక అవస్థలు పెట్టించి తిరిగి గుంటకల్‌కు వెళ్ళిపోమని జిల్లా అధికారి తన ఆర్డరును రద్దుపరచుకున్నాడు. ఈవిధంగా యెంక్వైరీ నిర్ణయంగా ఆఫీసర్ల దౌర్జన్యాలను బయటపెట్టిన కార్మికులను విక్టిమైజు చేస్తూ తమ నిరంకుశత్వాన్ని పూర్వమువలే సాగిస్తున్న డిష్ట్రిక్టు యింజినీరు, అసిస్టెంటు యింజనీరు చర్యలను యీ సభవారు నిరసిస్తున్నారు.

(3) గుంటకల్లులో పాయింట్సుమన్లు ట్రాన్సుఫర్లకోసరం యెన్ని అర్జీలు పెట్టుకున్ననూ, చెవులో వేసుకొనక, తమయిష్టమొచ్చినట్లు చేస్తు, కొందరికి ట్రాన్సుఫర్ ఆర్డరిచ్చి, రద్దుపరచటంద్వారా కార్మికులకు మానసికంగాను, ఆర్థికంగాను బాధలను కలిగించుచున్న జిల్లా ట్రాఫిక్ అధికారి చర్యలను యీ సభవారు నిరసిస్తున్నారు,

(4) ఈపై జిల్లా అధికార్లు కార్మికులు జాయింటు పిటీషన్‌ద్వారా బయట పెడుతున్నారన్న దురభిప్రాయంతొద్ది కార్మికులను విక్టిమైజు చేయటానికి పూనుకుంటున్నారు. యిట్టి అన్యాయాలు జరగకుండా చూడాలి.

★ ప్రతిజ్ఞ ★

అన్యాయాన్ని ఎదిరిస్తాం !
స్వాతంత్ర్యం సంపాదిస్తాం !
విప్లవవీరులమూ !
భారత పుత్రులమూ !
సమరోత్సాహులమూ !

* * *

శాంతి సభ్యతల అంతంజేసే
రాక్షస దౌర్జన్యం
ప్రపంచమంతను భస్మంజేసే
హిట్లర్-ఫాసిజం
ధ్వంసం జేస్తాం దగ్ధంజేస్తాం
గోరీకడతాం హిట్లరకూ

* * *

బానిస ప్రజలకు స్వాతంత్ర్యంబని
జపాను సైతాన్ దగాప్రచారం
జరుపుతున్నదండీ
చీనా రక్తం దాహం తీరని
జపాన్ పిశాచికి ఎరగాకండి !

* * *

భయపడకండి-దగాపడకండి,
చైనా రష్యాగాంచండి,
స్వతంత్ర పోరాటంలో,
ప్రపంచ ప్రజలూ కలిశారండీ!
జపాను జర్మనీ పొగరణగిస్తాం !
మానవ కోటికి ముక్తిని తెస్తాం.

"హితైషి"

అధికమాసము: జీతగాళ్ళు

యీసంవత్సరము అధికమాసము రావడంవల్ల పాలెళ్లు 13 వ మాసమునకుగూడ తమకు జీతం యిప్పించాలని చాలాగోట్ల ఆందోళన ప్రారంభమైంది. ఇది చాలా సక్రమమైన కోరిక రైతుసోదరులు, పాలేళ్ళు తమ శ్రమకు ప్రతిఫలాన్ని యివ్వాలనే యీన్యాయమైన కోరికను మన్నించి 13 వ మాసమునకుకూడా జీతమిచ్చి రైతు కూడా సామరస్యానికి తోడ్పడ ప్రార్థన.

ఇట్లు,
ముక్కామల నాగభూషణం,
టి. కె. రామస్వామి.

బెజవాడ రైల్వే లోకో ఫోర్మన్ చర్యల నిరసన

ది 14-6-42 జి. వెంకటరెడ్డి అనే కార్మికుడు లోకో ఫోర్‌మను దగ్గరకు వెళ్ళి తన కష్టాలకు స్వయంగా డి. టి. యస్. పి. ని చూచుటకు పర్మిషన్‌కోరగా పైనబడికొట్టాడు,

సాయంకాలం 5 గంటలకు కార్మికులంతా సమావేశమై లోకో ఫోర్‌మన్ చర్యలను నిరసిస్తూ యీ క్రింది తీర్మానాన్ని ప్యాసుచేశారు.

(1) యీ ఫోర్మన్ వచ్చినప్పటినుండియు, కార్మికులకు శలవులు, ప్యాసులు దొరకక యిబ్బందులను పడుతున్నారు. యింకా కార్మికులను కొట్టుట, తిట్టుటకూడా జరుగుచున్నది, యిట్టి అమానుష చర్యలను జరగకుండా చూచుటకుగాను, పై అధికారులు వెంటనే విచారణచేసి తగు చర్య తీసుకోవాలి.

రహింతుల్లా,
బ్రాంచి కార్యదర్శి.

మా ఏజంట్లు

విజయనగరం : కె. గోవిందరావు
రాజమండ్రి : కె. లక్ష్మీపతి
కాకినాడ : యస్. వి. రత్నం
గొల్లప్రోలు : యం. వెంకట్రాజు
మండపేట : పి. పనసరామన్న
కోరుమిల్లి : సూరిభొట్ల సూర్యనారాయణ
అమలాపురం : వి. గంగాధరరావు
అంతర్వేదిపాలెం: రాపాకసూర్యనారాయణ
అత్రేయపురం : ఇందుకూరి సోమరాజు
రామచంద్రపురం : బి. వి. రమణమూర్తి
పాలకొల్లు : పి. రామం
వీరవాసరం : బోను నారాయణరావు
తణుకు : వంక సత్యనారాయణ,
నిడదవోలు : వితాల పురుషోత్తం
పిప్పర : దండు సుబ్బరాజు
ఏలూరు : రంభా వెంకటప్పయ్య
చింతలపూడి : మాదాసు వీరవెంకయ్య
పేటపాలెం : కర్ల చంద్రమౌళి
బాపట్ల : కంభంపాటి సూర్యనారాయణ
నిడుబ్రోలు : ముక్కామల కోటేశ్వరరావు
పరుచూరు : ఉప్పులూరు ఆంజనేయులు
సత్తెనపల్లి : వావిలాల వీరభద్రరావు
చిలకలూరిపేట : కరణం రంగారావు
నర్సారావుపేట : శ్రీగిరిరాజు సత్యనారాయణ
గుంటూరు : ప్రతాప రామసుబ్బయ్య
తెనాలి : సామల సీతారామయ్య
కొల్లూరు : మాదల సీతారామయ్య
రేపల్లె; పి. వి. సుబ్బారావు
ఒంగోలు : వెంపటి వెంకటప్పదీక్షిత్
నెల్లూరు : ఆర్. భరద్వాజ్
గూడూరు : సి. సి. సుబ్బయ్య
నాయుడుపేట : చెరువు శ్రీనివాసులు
వెంకటగిరి : బీరం రామనాథం
కర్నూలు : ఆర్. తిప్పారెడ్డి
నంద్యాల : కోడి నరసింహం
అనంతపురం : విద్వాన్ విశ్వం
కడప : మోకా వెంకటసుబ్బయ్య
మదనపల్లి : డి. సీతారామయ్య
గుంతకల్ : యన్. నారాయణస్వామి
బెజవాడ : బెల్లపు వెంకటామయ్య
గవర్నరుపేట : ది వెరైటీ ఏజన్సీస్
బందరు : కిలారు రాఘవేశ్వరరావు
గుడివాడ : జాస్తి వీరరాఘవయ్య
కంకిపాడు : చింతమనేని శేషగిరిరావు
పామర్రు : శ్రీశివరామ సైకిల్ స్టోర్సు
గుడ్లవల్లేరు : వి. వెంకటగంగాధరరావు
చల్లపల్లి : కె. గోపాలకృష్ణయ్య
నందిగామ : గుణ్ణం రామిరెడ్డి
గన్నవరం : కాట్రగడ్డ వెంకట్రాయుడు

8 వ పేజి తరువాయి

ప్రదర్శనహాల్ గుమ్మంలో అడుగు పెట్టేసరికి ఎదురుగుండా కనపడుతూ, ప్రతి హృదయాన్ని ఊగిసలాడించేవి !

బొంబాయి ప్రోగ్రెసివ్ థియేటర్ ఎసోసియేషన్ తరపున విద్యార్థులు ప్రదర్శించిన "నలుగురు కామ్రేడ్స్" అనే నాటిక చాల ఉద్రేకంగా జాతీయ ప్రతిఘటన పురికొల్పే ట్టున్నది. డిటెన్యూ విడుదలగురించి మరో నాటిక బెంగాల్ విద్యార్థులు ప్రదర్శించారు. తరువాత ముఖ్యంగా చెప్పుకోతగ్గ విషయం వివిధ రాష్ట్రాల విద్యార్థులు పాడిన పాటలు ; సారాసంసార్ హమారాహై ; వగైరా.

ప్ర జా శ క్తి

సంవత్సర చందా	3-0-0
అర్ధసంవత్సర చందా	1-12-0
విడిప్రతి	0-1-0

ప్ర జా శ క్తి

అడ్వర్టైజ్ మెంటు రేట్లు

పూర్తిపేజి ఒకసారికి		35-0-0
అరపేజి	,,	18-0-0
పావుపేజి	,,	10-0-0
కాలం అంగుళం		0-12-0

అఖిలభారత విద్యార్థి కన్వెన్షన్ : జాతీయరక్షణ మహాసభ

ఇన్ని సంవత్సరాల నుండి జరిగిన మహాసభలకు. ఢిల్లీసభకు చాలతేడావుంది. నేడు భారత దేశం ఎన్నడూ కనివినియెరుగని విషమ ఘట్టంలో ఉంది. జపాన్ ఫాసిస్టులు భారత దేశంమీద దండ యాత్ర ప్రారంభించారు. భారతదేశ రక్షణ సమస్య ఒక్కటే ఈ రోజున అత్యంత ప్రాధాన్యత వహిస్తుంది.

పాట్నా మహాసభలో భారత విద్యార్థులే ముందంజవేసి, ప్రపంచ ప్రజల ఫాసిస్టు వ్యతిరేక యుద్ధమే భారతస్వాతంత్ర్య యుద్ధం అనిచాటి నూతనపంథా యిచ్చారు.

పాట్నాయిచ్చిన నూతన పంథాకు ఢిల్లీ కార్యాచరణ యిచ్చింది! ఇదేఢిల్లీ మహాసభ యొక్క చారిత్రక ప్రాముఖ్యత!

మహాసభ కార్యక్రమం

జాతీయ రక్షణ మహాసభకు కూడా, దేశంలోని వివిధ విద్యార్థి సంఘాలకు యువజన సంఘాలకు, ఎ. ఆర్. పి. సంఘాలకు ఆహ్వానాలు పంపబడినాయి.

మే 15 వ తారీఖు వుదయం 8 గం॥ మహాసభ అధ్యక్షులైన స్వామి సహజానంద సరస్వతిగారికి స్టేషన్ వద్ద స్వాగతం యిచ్చిపెద్దవిద్యార్థి ఊరేగింపు జరుపబడింది. విద్యార్థిజెండాలు వివిధ రాష్ట్రాల బానర్లు, ప్రజాయుద్ధ నినాదాలతో గొప్ప విద్యార్థి ప్రదర్శనం జరిగింది.

విషయనిర్ణయ సభ

మధ్యాహ్నం వివిధరాష్ట్రాల నుండి వచ్చిన 500 మంది ప్రతినిధులతో విషయ నిర్ణయ సభ సమావేశమైంది. అంతకు ముందే అఖిల భారత విద్యార్థి సంఘ కార్యనిర్వాహక వర్గం కౌన్సిలు సమావేశాలు జరిగాయి.

విషయ నిర్ణయ సభలో కామ్రేడ్ ఫరూకీ యుద్ధం జాతీయరక్షణ అనేప్రధాన తీర్మానం ప్రవేశపెట్టేడు. సంయుక్త జాతీయ ప్రతిఘటన కొరకు కాంగ్రెసు ముస్లింలీగు ఐక్యత కోసం కొత్త ప్రయత్నం అత్యవసరంగా చేయాలి. దేశరక్షణాధికారం అధీనంలోకి తెచ్చుకొని కాంగ్రెసు లీగుసంయుక్త మంత్రివర్గాలు ఏర్పడాలి. జపాన్ శత్రువును తప్పక ప్రతిఘటించాలి, భారత విద్యార్థులందరూ అందుకు రావాలి. ప్రజావలంటీరు దళాలు ఎ. ఆర్. పి. దళాలు చేరాలి. యుద్ధం చేస్తూన్న సైన్యాలకు సహాయం చేయాలి ప్రజలకు సైన్యాలకు మధ్య సామరస్యం సంపాదించాలి. కార్యక్రమం నిర్వహించాలి.

విముక్తి పోరాటం అనే మరోతీర్మానంలో ప్రపంచ ప్రజల విముక్తి పోరాటం ప్రారంభ మైనదనీ ప్రపంచసామ్రాజ్యవాదానికీ బల్లెపు మొనగానున్న ఫాసిష్టు దురాక్రమణ దారులకు వ్యతిరేకంగా సోవియట్, జాతీయ చీనా, బ్రిటన్. అమెరికా దేశాల ప్రజలు జరిపే యుద్ధం ప్రజాయుద్ధమనీ, అదే భారత విముక్తి పోరాటమనీ తెలియజేయబడింది.

తరువాత సోవియట్, చైనా, బ్రిటిష్ విద్యార్థులకు అభినందన సందేశాలు పంపుతూ వేర్వేరు తీర్మానాలు చేయబడినవి. జాతీయ రక్షణ మహాసభలో పాల్గొనుటకు వీలుగా విడుదల చేయబడి, సభకు వచ్చిన వివిధ రాష్ట్రాల విద్యార్థి డిటిన్యూలు యిచ్చిన సందేశం మరో తీర్మానంగా ఆమోదించబడింది. అంతటితో విషయ నిర్ణయ సభ ప్రథమసమావేశం ముగిసింది.

మహాసభ ప్రారంభం

సాయంత్రం 5 గం॥లకు దివాన్‌హాల్లో మహాసభ ప్రారంభమైంది. విద్యార్థి ప్రతినిధులు, ప్రేక్షకులు 3000లకు మించారు ఫాసిజమ్ నశించాలి. ఫాసిస్టువ్యతిరేక ప్రజాపోరాటానికిలెండు! భారతదేశరక్షణకు పూనుకొండి! అనే నినాదాలు గల ప్లేకార్డులు, విద్యార్థి జెండాలు సోవియట్ మిత్రమండలి జెండాలతో సభాస్థలం అలంక రించ బడింది.

ప్రభుత్వ సినిమావార్తా చిత్రశాఖవారు మహాసభ దృశ్యాలు తీయటం ప్రారంభించారు. బొంబాయి యు. పి. ప్రతి నిధులు పాడిన ఫాసిష్టు వ్యతిరేక గీతాలలోని హాలు మార్మోగింది. ప్రేక్షకులు ఉగిపోయారు.

కామ్రేడ్ సజ్జాద్‌జహీర్ మహాసభ ప్రారంభిస్తూ దేశ రక్షణకోసం ఎదురు తెన్నులుచూస్తూ కూచుంటే, దేశం ఫాసిష్టుల దురాక్రమణకు గురి అవుతుందనీ, ప్రజాచొరవతో దేశరక్షణ కార్యాల్లో పాల్గొనాలని చాల ఉత్తేజకరమైన ఉపన్యాసం చెప్పారు.

అఖిలభారత రైతు సంఘాధ్యక్షులు శ్రీ స్వామి సహజానంద సరస్వతి అధ్యక్షోపన్యాసంలో యిట్లు చెప్పారు. "నేడు ప్రపంచ సామ్రాజ్యవాదం రెండు ముక్కలగ చీలి బలహీన పడటం ప్రపంచ అభివృద్ధికర శక్తులదే పై చెయ్యి అవటం సుస్పష్టం. చక్కని అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రపంచ ప్రజలు జరుపుతూన్న ఫాసిస్టు వ్యతిరేక ప్రజాయుద్ధాన్ని బలపర్చటమే మన తక్షణ కర్తవ్యం. ఫాసిస్టు దురాక్రమణ దారుల నెదుర్కొనడానికి మనం సంసిద్ధం కావాలి.

నా ఆశలన్నీ భారత యువకులమీదే ఉన్నాయి. సోవియట్‌రష్యా, చైనా విద్యార్థి యువకుల్లాగ మీ పవిత్ర కర్తవ్యాన్ని నెఱవేర్చండి. భారతదేశం అంతా ఒక్క మనిషిలా నిలచి ఫాసిస్టు ప్రతిఘటనకు పూనేలా చేయండి! ఫాసిస్టు రాక్షసుల్ని నాశనం "చేయండి. భారత స్వతంత్ర పోరాటం వర్ధిల్లాలి!" అని గంభీరంగా ఉపన్యసించారు. ఫాసిస్టు వ్యతిరేక నినాదాలతో సభ ముగిసింది. 16 వ తేదీ వుదయం మళ్ళా విషయ నిర్ణయసభ జరిగింది.

విద్యార్థుల కోర్కెలు

విద్యార్థుల కోర్కెలు అనే తీర్మానంలో విద్యార్థుల యుద్ధ సమయంలోని అత్యవసర కోర్కెలు, డిమాండ్లు తెలియజేయబడినై. విద్య యుద్ధపరిస్థితుల్లో గూడా తప్పక కొనసాగించబడాలి, కాశీ చేసేటప్పుడు ముందు ఏర్పాట్లు చేయాలి, పాఠశాలలు మూసివేయకూడదు. ఉపాధ్యాయుల సంఖ్య, జీతాలు తగ్గించరాదు. విద్యార్థి వేతనాలు తగ్గించాలి ప్రతి స్కూలును ఎ. ఆర్. పి. రక్షణలుండాలి. విద్యావిధానంలో, సైన్సు, టెక్‌నాలెడ్జి పారిశ్రామిక విద్యలకు ప్రాముఖ్యత యివ్వాలి. మిలటరీశిక్షణ ఎ. ఆర్. పి. ప్రథమచికిత్స నిర్బంధంగా నేర్పాలి. ఫాసిస్టు వ్యతిరేక ప్రచార దళాలు ఏర్పడే అవకాశం, విద్యార్థులలో విజ్ఞాన ప్రదర్శనాలు పఠన బృందాలు పెట్టే సౌకర్యాలు యివ్వాలి. అఖిలభారత విద్యార్థిసంఘం ఎ. ఆర్. పి. అనే తీర్మానంలో ప్రభుత్వ ఎ. ఆర్. పి. సంఘానికి కొన్ని సూచనలు చేయబడినాయి. అన్నిరాష్ట్రాలలోను ముఖ్య పట్టణాలలోను అఖిలభారత విద్యార్థిసంఘం ఎ. ఆర్. పి. తో సన్నిహిత సంబంధం పెట్టుకొని ప్రజాసామాన్యంతో సంబంధం కలపాలి. ఎ. అర్. పి. శిక్షకులుగ తయారు కావాలి. ప్రభుత్వం శిక్షణాతరగతులు ఏర్పరచాలి. విమాన దాడి రక్షణగురించి ప్రజలలో ప్రచారం చేయుటకు ఎ. ఆర్. పి. ప్రచార దళాలు నిర్మించాలి. తీర్మానం ఆమోదించబడింది తీర్మానాలన్నీ పూర్తిగా చర్చించబడి ఆమోదింపబడిన తరువాత విషయ నిర్ణయసభ ముగిసింది.

మధ్యాహ్నం బహిరంగ సమావేశం ప్రారంభమైంది. సభకు కామ్రేడ్ రంగనేకర్ 'స్టూడెంటుకాల్ సంపాదకుడు' అధ్యక్షత వహించాడు. యుద్ధం జాతీయ రక్షణ అనే తీర్మానాన్ని కామ్రేడ్ ఫరూకీ ప్రవేశపెడుతూ 20 నిమిషాలు నూతన పంథా కాంగ్రెసు నిష్క్రియత ప్రజాయుద్ధం గురించి వివరించాడు. మిగిలిన తీర్మానాలు కామ్రేడ్స్ పెరిన్‌బరూచా (ప్రధాన కార్యదర్శిని) రమేష్‌చంద్ర, అరుణ బోసు ఉపపాదించి తీర్మానాలు వివరించి తెలియజేశారు.

తరువాత కామ్రేడ్ సోహన్‌సింగ్ జోష్, (పంజాబు కమ్యూనిస్టు నాయకుడు) విశ్వనాధముఖర్జీ, కృష్ణన్, నక్వీ మొదలగు విద్యార్థి నాయకులు ప్రజాయుద్ధంగురించి ఫాసిస్టు దురాక్రమణ గురించి, జాతీయ ప్రతిఘటనగురించి ప్రబోధం చేశారు. రాత్రి 10 గం॥లకు ఫాసిస్టు ప్రతికూల నినాదాలతో ముగిసింది.

ఎ. ఆర్. పి. ప్రథమ చికిత్స ప్రదర్శనాలు

17 వ తేదీ ఉదయం కమ్మర్షియల్ కాలేజి ఆటస్థలంలో ఎ. ఆర్. పి. ప్రథమ చికిత్సప్రదర్శనాలుజరిగాయి. ఢిల్లి బెంగాల్ విద్యార్థులు చక్కని శిక్షణతో చాల నేర్పుగా అన్నిటినీ ప్రదర్శించారు. స్టిరప్ పంప్‌పద్ధతి, బకెట్ పార్టీ, ఇసుక పద్ధతులతో బాంబులు ఫలితంగా వచ్చిన మంట నార్పుట చూపెట్టారు. ఢిల్లీ ఎ. ఆర్. పి. శాఖవారు మోడెల్ బాంబులుసరఫరాచేశారు. తరువాత రెస్క్యూ పార్టీ చాల అద్భుత శిక్షణతో, మేడ మీదకు ఎక్కి, తాళ్ళు, గుడ్డలు సహాయంతో ఆర్తుల్నిదింపటం ప్రథమచికిత్స చేయటం చాల బాగా ప్రదర్శించారు. తర్వాత బెంగాల్ విద్యార్థులుకూడా, మంటలనార్పుట, పొగలోనుండి ఆర్తుల్ని రక్షించుట, ప్రదర్శించారు, మొత్తం మీద ఎ. ఆర్. పి. విషయంలో విద్యార్థులు స్వయంగా ముందంజవేసి తీసుకున్న శిక్షణ చాల ఉత్సాహకరంగానే ఉంది.

చిత్రకళా ప్రదర్శనం

మహాసభ హాలుపై వివిధరాష్ట్రాల నుండి తెచ్చిన చిత్రాలు ప్రదర్శించారు. బొంబాయి విద్యార్థులకే అగ్రతాంబూలం యివ్వాలి. సోవియట్ మిత్రమండలి, పీపుల్స్ ప్రోగ్రెసివ్ థియేటర్ ఎసోసియేషన్, బొంబాయి రాష్ట్రవిద్యార్థిసంఘాల తరపున ప్రదర్శించిన వాల్‌న్యూస్‌పేపర్సు లెనిన్ కార్నర్, ఫాసిస్టు వ్యతిరేక వ్యంగ్యచిత్రాలు, సోవియట్, చీనా యుద్ధ చిత్రాలు చాల బాగున్నాయి. వాల్‌న్యూస్ పేపరు చాల ఆదర్శవంతంగా, విషయ పరిజ్ఞానంతో కూడివుంది. కళ్ళు చెదిరే ఎఱ్ఱటి గుడ్డ బ్యాక్‌గ్రౌండుమీద తెల్లటి అక్షరాలతో సోవియట్ భూమి వర్ధిల్లాలి. సుత్తి కొడవలి అక్షరాలు మిలామిలా మెరుస్తూ చాల ఆకర్షణీయంగా హృదయోత్తేజకంగా [మిగతా 7 వ పేజీలో]

Edited and Published by Katragadda Rajagopala Rao and Printed by The Popular Printers, Bezwada

END OF ISSUE